Namasthe Telangana Dt- 16/02/14

మెట్రో స్టేషన్లలో చిన్నారులు, యువత, మహిళల కోసం ప్రత్యేక ఏర్పాట్లు

ఈటింగ్, షాపింగ్, గేమింగ్ ఏదైనా..







# స్టేషన్‌కో స్పెషల్

మెట్రో రైల్ స్టేషన్లు అన్ని వర్గాలను కట్టుకునేలా రూపుదిద్దుకోబోతున్నాయి. అందరి అవసరాలు తీర్చే విధంగా ఒక్కో స్టేషన్‌లో ఒక్కో ప్రత్యేకత ఉండబో తోంది. దుస్తులు, స్పోర్ట్స్, జిమ్ పరికరాలు, పిల్లల మానసిక, శారీరక వికాసానికి సైకిల్ ట్రాక్‌లు, నీటి కొలనులు, మహిళల కోసం 'తరుణి' పేరిట షాపింగ్ జోన్‌లు సిద్ధం కానున్నాయి.

18

**వచ్చే ఏడాది పంద్రాగస్టు నాటికి మెట్రో రెండో దశ పూర్తి : మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి**

Namasthe Telangana     Dt 16/02/14



# గేమింగ్..షాపింగ్..ఈటింగ్

- 'మెట్రో'లో మెనీ సేవలు
- ఒక్కో స్టేషన్‌కు ఒక్కో ప్రత్యేకత
- మహిళలు, చిల్డ్రన్, యువత కోసం ప్రత్యేక సదుపాయాలు
- వివరాలు వెల్లడించిన ఎండీ ఎన్వీఎస్ రెడ్డి



**మెట్రో ప్రయాణం వేగవంతమే కాదు సౌలభ్యం కూడా. సకుటుంబ సపరివారంతో క్షేమంగా వెళ్లి లాభంగా వచ్చే ప్రయాణం ఇది. గమ్యస్థానానికి వేగంగా చేర్చే మెట్రో రైల్లాగే స్టేషన్లు పిల్లలు, పెద్దలు, మహిళల కోసం సరికొత్త వసతులతో మైమరిపించబోతున్నాయి. ఆటపాటలు కోరుకునే పిల్లల కోసం గేమింగ్ జోన్లు, మహిళల కోసం షాపింగ్, పెద్దల కోసం ఈటింగ్ సదుపాయాలతో మెట్రో సేవలు పలు విధాలుగా ఉపయోగపడబోతున్నాయి. డబ్బు ఆదా! సమయం ఆదా! ప్రయాణం భద్రం! ఇన్ని వింతల మెట్రోరైలు ఎప్పుడొస్తుందో కానీ హైదరాబాదీల ఆశలు ఇప్పుడే చిగురిస్తున్నాయ్!**

**-టీ మీడియా, సిటీబ్యూరో**

వృద్ధులు పిల్లలు గ్రామీణ వాతావరణాన్ని కోల్పోతున్నారని, వారికి ఆహ్లాదం పంచుదామంటే నగర జీవనం కదా.. సాధ్యపడదని నిరాశపడుతున్నారా.. అసలే మహిళలం...! పైగా గంటల కొద్ది ట్రాఫిక్.. రోడ్డుదాటే దారేది? షాపింగ్ కోసం మార్కెట్లోకి ఎలా వెళ్లగలమని ఆలోచిస్తున్నారా...! మేమసలే యూత్.. చాలా డిఫెరెంట్‌గా ఉంటాం.. అందరిలా ఉండటాన్ని ఒప్పుకోమంటున్నారా..! సాయంత్రం అయ్యింది. ఇంట్లో ఏం వండాలి. ఇంట్లో ఏమన్నా ఉన్నాయో లేవో..? అంటూ కలత చెందుతున్నారా. అయితే మీ అందరి అవసరాలు తీర్చడానికి మేమున్నామంటూ ముందుకు వస్తోంది 'హైదరాబాద్ మెట్రోరైలు'. మా స్టేషన్ వస్తే ప్రయాణమే కాదు. షాపింగ్ చేసుకోవడానికి, కూరగాయలు కొనుక్కోవడానికి, యూత్ అంచనాలకు, పిల్లల అభిరుచులకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నా'మని సంస్థ అధికారులు అంటున్నారు. దీని కోసం ప్రత్యేక స్టేషన్లను ఏర్పాటు చేస్తున్నామంటున్నారు. ఆయా స్టేషన్ల జాబితాను, వాటి ప్రత్యేకతలను హెచ్ఎంఆర్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి మీడియాకు వివరించారు.

- ఢిల్లీ మెట్రోలో లేడీస్ స్పెషల్ పేరుతో మహిళల కోసం ప్రత్యేక ట్రెయిన్లను నడుపుతున్నారు. సెంట్రల్ సెక్రటేరియట్- బదర్‌పూర్ మార్గంలో వీటిని నడుపుతున్నారు. దీన్ని మోడల్‌గా తీసుకుని, నూతన ఆలోచనలు జోడించి, వీటిని ఏర్పాటు చేయడానికి నిర్ణయం తీసుకున్నారు. ఇవే కాకుండా మరిన్ని స్టేషన్లలో ఇలాంటి ప్రత్యేకతలతో స్టేషన్లను ఏర్పాటు చేస్తామని ఎన్వీఎస్ రెడ్డి చెప్పారు.
- యువత కోసం యూసుఫ్‌గూడ కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియం స్టేషన్.
- పిల్లల కోసం ఉప్పల్, మియాపూర్‌లలో చిల్డ్రన్స్ స్టేషన్.
- కూరగాయల అమ్మకాల కోసం రైతు బజార్‌గా భరత్‌నగర్ స్టేషన్.



### చిల్డ్రన్స్ స్టేషన్..

పిల్లలు ఆటలాడుకోవడానికి వీలుగా చిల్డ్రన్స్ స్టేషన్లను ఏర్పాటు చేయనున్నారు. ఉప్పల్, మియాపూర్‌లలో వీటిని ఏర్పాటు చేస్తారు. పిల్లలకు మానసిక, శారీరక వికాసాన్ని అందించడానికి ఈ స్టేషన్లను చెట్లు, కాల్వలు, నీటి కొలనులు, సైకిల్ ట్రాక్‌లాంటి అన్ని హంగులతో ఏర్పాటు చేస్తారు.

### లేడీస్ స్టేషన్..



దీన్ని కారిడార్-3లోని మధురానగర్‌లో ఏర్పాటు చేస్తారు. దీనికి తరుణి అని నామకరణం చేశారు. రెండెకరాల విస్తీర్ణంలో ఈ స్టేషన్‌ను ఏర్పాటు చేస్తారు. పూర్తిగా మహిళల షాపింగ్ కోసం ఉద్దేశించి స్టేషన్ ఇది. బొట్టు బిళ్లల నుంచి మహిళలకు సంబంధించిన అన్ని రకాల యాక్సెసరీలను అందుబాటులో ఉంచుతారు. ఈ ప్రాంతం సంపన్నవర్గాలు అధికంగా ఉంటే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఫిల్మ్‌నగర్‌లకు సమీపంలో ఉండటంతో ఇక్కడ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ స్టేషన్‌తో మధురానగర్, వెంగళరావునగర్, యూసుఫ్‌గూడ ప్రాంతాలకు కొత్త షాపింగ్ కళ రానుంది.

### మెట్రో రైతుబజార్..

ఈ రైతుబజార్‌ను భరత్‌నగర్‌లో ఏర్పాటు చేయనున్నారు. భరత్‌నగర్ స్టేషన్ నిర్మాణం కారణంగా 40 మంది హోల్‌సేల్, రిటైల్ అమ్మకందారులు నిర్వాసితులయ్యారు. వీరికి తాత్కాలికంగా ఏర్పాట్లు చేయగా, స్టేషన్ నిర్మాణం తర్వాత వీరికి రైతుబజార్ స్టేషన్‌లోనే ప్రత్యేకంగా ఉపాధి కల్పించనున్నారు. దళారీలకు ఆస్కారం లేకుండా, ప్రయాణికులు స్వేచ్ఛగా కూరగాయలను కొనుగోలు చేసుకోవడానికి అవకాశం ఉంటుంది. రైతులే నేరుగా ఈ రైతు బజార్‌లో అమ్మకాలు సాగించవచ్చు.



### యూత్ స్టేషన్..

యూసుఫ్‌గూడలోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియం వద్ద ఏర్పాటు చేయనున్న స్టేషన్‌ను యూత్ స్టేషన్‌గా పరిగణిస్తున్నారు. యూత్ కోసం స్పోర్ట్స్, జిమ్ పరికరాలు, మార్కెట్లోకి కొత్తగా వస్తున్న ఫ్యాషన్ వేర్‌ను అందుబాటులో ఉంచుతారు. ఎస్సార్‌నగర్, శ్రీనగర్‌కాలనీ యూసుఫ్‌గూడ, ప్రాంతాల్లో యూత్ హాస్టళ్లు ఎక్కువగా ఉండటంతో ఇక్కడ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

## 2015 పంద్రాగస్టు నాటికి

# మెట్రో రెండోదశ పూర్తి



■ భరత్‌నగర్‌లో ఆర్‌వోబీ స్కైవాక్ ■ కూరగాయల మార్కెట్ నిర్మాణం: మెట్రో ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి



సిటీబ్యూరో, టీ మీడియా: మెట్రోరైలు ప్రాజెక్ట్ కారిడార్-1లోని స్టేజ్-2ను వచ్చే ఏడాది ఆగస్టు 15 నాటికల్లా పూర్తి చేస్తామని మెట్రోరైలు ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి వెల్లడించారు. ఎస్సార్‌నగర్ నుంచి మియాపూర్ వరకు గల ఈ మార్గాన్ని 2015 స్వాతంత్ర్య దినోత్సవ కానుకగా ప్రజలకు అంకితం చేస్తామని ఆయన ప్రకటించారు. శనివారం ఎల్అండ్‌టీ, మెట్రోరైలు అధికారులతో కలిసి మెట్రోరైలు పనులను పర్యవేక్షించారు. ఎర్రగడ్డ స్టేషన్ నుంచి మూసాపేట స్టేషన్ వరకు కొనసాగుతున్న పనులను మెట్రో ఎండీ పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. తొలిదశ పనులు వేగంగా కొనసాగుతున్నాయని, వచ్చే ఏడాది ఉగాది నాటికి నాగోలు- మెట్టుగూడ మార్గాన్ని ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు. భరత్‌నగర్, మూసాపేట స్టేషన్లు మినహా స్టేజ్-2లోని మిగతా 8 స్టేషన్ల పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ రెండు స్టేషన్ల డిజైన్‌ను కూడా మార్చనున్నామన్నారు. అక్కడున్న భూ సామర్థ్యాన్ని బట్టి స్టేషన్‌లను నిర్మించడానికి ప్రయత్నిస్తామన్నారు. ఈ రెండు స్టేషన్ల పరిధిలో వీక్ సాయిల్ ఉండటం చేత పనులు సాగడం లేదన్నారు. ఈ స్టేషన్ల పరిధిలో పిల్లర్ల నిర్మాణం కోసం షొరింగ్, షట్టరింగ్, పైల్ ఫౌండేషన్ పద్ధతులను వినియోగిస్తున్నామని వివరించారు. పిల్లర్ల కోసం ఒక్కోచోట 30 నుంచి 60 అడుగుల లోతు వరకు గుంతలు తవ్వి సిమెంట్‌తో నింపి పటిష్టం చేస్తున్నామన్నారు. ఒక్కో పిల్లర్ నిర్మాణానికి 6 పైల్స్‌ను వినియోగిస్తున్నామని, వారంరోజుల్లో ఒక పైల్ పూర్తవుతుందన్నారు. భరత్‌నగర్ వద్ద గల నాలాతో పాటు, భారీ విద్యుత్ లైన్లను అండర్‌గ్రౌండ్‌లోకి మార్చామని తెలిపారు. మూసాపేటలో రోడ్డుకిరువైపులా 8 మీటర్ల మేర కొత్త రోడ్డును నిర్మిస్తున్నామని, ఐడీఎల్ చెరువు నుంచి ఉన్న మూడు నాలాలను రూ. 4 కోట్లు వెచ్చించి అండర్‌గ్రౌండ్‌లోకి మార్చామన్నారు.

### బ్యాలెన్స్ క్యాంటిలివర్‌తో భరత్‌నగర్ ఆర్‌వోబీ

భరత్‌నగర్ రైల్వే బ్రిడ్జి పక్కన ట్రాక్ నిర్మాణం కోసం 'బ్యాలెన్స్ క్యాంటిలివర్' పద్ధతిలో రైల్వే ఓవర్ బ్రిడ్జిని బిగించనున్నామని ఎన్వీఎస్‌రెడ్డి తెలిపారు. 5 ట్రాక్‌లున్న ఈ మార్గంలో 11 మీటర్ల ఎత్తులో ఆర్‌వోబీని నిర్మిస్తామన్నారు. రైల్వేశాఖ స్థలాన్ని మినహాయించి, మెట్రోరైలుకు కేటాయించిన స్థలంలో అటు చివర, ఇటు చివర పిల్లర్లను నిర్మిస్తామని, పిల్లర్‌ల మధ్య కనీసం 65 మీటర్ల దూరం ఉంటుందని తెలిపారు. ట్రాక్‌కు రెండువైపులా 66 మీటర్ల మధ్యలో ఎలాంటి ఆధారం లేకుండా వయాడక్ట్‌ను బిగించడం సవాల్‌తో కూడుకున్న పనని మెట్రో ఎండీ చెప్పారు. సాధారణంగా మెట్రో మార్గంలో 31 మీటర్ల వ్యవధి, స్టేషన్ల వద్ద 13.5, కొన్నిచోట్ల 17 మీటర్ల వ్యవధిలో పిల్లర్లు ఉంటాయని, వాటిని దాటుకుని రైల్వే ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా ఉండేందుకే బ్యాలెన్స్ క్యాంటిలివర్ పద్ధతిని ఎంచుకున్నామన్నారు.

### స్కైవాక్ కూడా...

భరత్‌నగర్ మెట్రోస్టేషన్ నుంచి ఎమ్ఎమ్‌టీఎస్ స్టేషన్ వరకు ప్రయాణికుల సౌకర్యార్థం స్కైవాక్‌ను ఏర్పాటు చేస్తున్నాయని ఎన్వీఎస్ రెడ్డి వెల్లడించారు. స్కైవాక్‌ల ద్వారా మెట్రో ప్లాట్‌ఫాం నుంచి ఎమ్ఎమ్‌టీఎస్ ప్లాట్‌ఫాంకు నేరుగా చేరుకోవచ్చన్నారు. మిగతా ప్రాంతాల్లో సైతం స్కైవాక్‌లు ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు.

### కొత్త మార్కెట్ నిర్మాణం...

భరత్‌నగర్‌లో ట్రాక్ నిర్మాణం కోసం నివాస గృహాలు, కూరగాయల మార్కెట్‌ను కూడా తొలగించామన్నారు. మార్కెట్ తొలగించడం కారణంగా వర్తకులు ఉపాధి కోల్పోకుండా తాత్కాలిక ఏర్పాటు చేస్తున్నామన్నారు. 40 మంది వర్తకులు అమ్ముకోవడానికి, మార్కెట్‌కు ప్రత్యామ్నాయంగా భరత్‌నగర్ బ్రిడ్జి కింది భాగంలోని ఖాళీ షెడ్డును ఆర్అండ్‌బీ నుంచి రెండు సంవత్సరాలకు లీజు తీసుకున్నామని, తాత్కాలికంగా అందులోనే కూరగాయల మార్కెట్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. ట్రాక్ నిర్మాణం పూర్తి కాగానే శాశ్వత మార్కెట్‌ను నిర్మించి ఇస్తామన్నారు.